# 'ఇన్‌కాయిస్'.. మీ చాయిస్

గాజులరామారం:

అనుకోకుండా విరుచుకుపట్టి భారీ విధ్వంసాన్ని, వినాశనాన్ని కలిగించే ప్రకృతి వైపరీత్యాలను ఎప్పటికప్పుడు పసి కట్టి ప్రభుత్వ శాఖలను, తీరప్రాంత ప్రజల అప్రమత్తం చేసే సంస్థ ఇన్‌కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్). నిరంతర నిఘాతో ప్రతి నిమిషం సముద్ర స్థితిగతులపై పరిశోధనలు చేస్తూ దేశ,విదేశాలకు ముఖ్య సమాచారంతో పాటుగా ముందస్తు హెచ్చరికలు అందిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లనివ్వకుండా చూడటంలో కీలక పాత్ర పోషిస్తోంది. మినిస్ట్రీస్ ఆఫ్ ఎర్త్ అండ్ సైన్స్ శాఖలో అంతర్భాగంగా పనిచేస్తున్న సునామీ హెచ్చరికల కేంద్రం గాజులరామారం పరిధిలోని ప్రగతినగర్‌లో కేంద్ర కార్యాలయంగా పనిచేస్తోంది. 2002 నుంచి వెబ్ సైట్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్న ఇన్‌కాయిస్, తన సేవలను అందరికి చేరువ చేసేందుకు మరో అడుగు ముందుకేసింది.

### వెబ్ పోర్టల్ ద్వారా సమాచారం

ఇన్‌కాయిస్ సంస్థ సేకరించిన సమాచారాన్ని కోస్ట్ ఏరియా, ఇండియన్ నేవీ, ఫిషర్స్ మ్యాన్, తీర ప్రాంతాలలోని పోర్ట్ యూజర్‌లతో పాటుగా సంస్థ వైబ్ సైట్‌లో కూడ సమాచారాన్ని అందుబాటులో ఉంచనుంది. సముద్ర తీర ప్రాంతాలకు చెందిన లోకల్ లాంగ్వేజ్‌లో ఈ సమాచారాన్ని పంచుకోనుంది. ప్రస్తుతం ఉన్న వెబ్‌కు అడ్వాన్స్‌డ్‌గా మరో వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తోంది.

- రేపు లాంఛనంగా వెబ్ పోర్టల్ ప్రారంభం
- సముద్ర స్థితిగతుల పూర్తి సమాచారం అందుబాటులోకి
- సులభంగా యూజర్ రిజిస్ట్రేషన్
- ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం

### సులువుగా సులభంగా..

ప్రస్తుతం ఉన్న వెబ్ సైట్‌ను మరింత ఉపయోగకరంగా ఇన్‌కాయిస్ వెబ్ బేస్డ్ సర్వీస్ బృందం తీర్చిదిద్దింది. సులువుగా ఆపరేట్ చేసేలా, అందరికీ సులభంగా అర్థమయ్యేలా రూపొందించారు. ఏ సమాచారం ఏ ఆప్షన్‌లో ఉంది, ఎలా తెలుసుకోవాలి, సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని సైతం సరళతరంగా డిజైన్ చేసింది. గుజరాత్, మరాఠి, కొంకిణి, కన్నడ, మలయాళం, తెలుగు, ఒరియా, బెంగాలీ, తమిళ భాషలలో ఇంతకు ముందు లేని సమాచారాన్ని అందుబాటులో ఉంచనుంది. చేపలు సంవృద్ధిగా ఉన్న ప్రదేశంతో పాటుగా సముద్రస్థితి, వాతావరణ సూచనలు, సునామీ హెచ్చరికలను పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు.

### సముద్ర స్థితులు, టూనా ఫిషింగ్...

కొత్తగా అందుబాటులోకి రానున్న బెబ్ పోర్టల్‌లో సముద్ర అలలు, అలల అవధి, కెరటం అవది, సముద్రం, తీర ప్రాంతాల్లో గాలి తీవ్రత వంటి ఖచ్చిత సమాచారాన్ని పొందుపరచనున్నారు. అదేవిధంగా అత్యంత విలువైన టూనా చేపల స్థితిగతులపై సమాచారాన్ని ప్రాంతీయ భాషలలో అందుబాటులో ఉంచనున్నారు. తీర ప్రాంతాల వెంబడి ఉన్న ఈడీబీ (ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డ్) సమాచారాన్ని సైతం ఇందులో ఉంచనున్నారు.

### అందుబాటులోకి యూజర్ రిజిస్ట్రేషన్

కొత్తగా అందుబాటులోకి రానున్న సైట్‌లో ఇన్‌కాయిస్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలంటే వారి ఫోన్ నంబర్‌ను వెబ్‌సైట్‌లో రిజిష్టర్ చేసుకోవచ్చు. ఇందుకోసం మీ పేరు, ప్రాంతం, ఫోన్ నంబరు, ఏ తీర ప్రాంతానికి చెందిన సమాచారాన్ని తెలుసుకోవాలనుకుంటున్నారో పొందుపరిస్తే సరిపోతుంది. రిజిస్టర్ అయిన అనంతరం మీ ఫోన్‌కు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం వస్తుంది.

### రేపు ప్రారంభం

ప్రగతినగర్ ఇన్‌కాయిస్ కేంద్రంలో వెబ్ డెవలపింగ్ బృందం కొత్త సైట్‌కు తుది రూపులు దిద్దుతోంది. సంస్థ ఆవరణలోని వెబ్ బేస్డ్ సర్వీస్ గ్రూపు బృందం టీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో పరిశోధకులు కిరణ్ బృందం కృషి చేస్తోంది. అధికారికంగా సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు.

### సమగ్ర సమాచారం..



పాత వెబ్ పోర్టల్‌ను పూర్తిగా అప్‌డేట్ చేస్తున్నాం. ఇంతకు ముందు లేని వివిధ విభాగాల సమాచారాన్ని ఇందులో పొందుపరుస్తున్నాం. అందరికీ అందుబాటులో ఉండేలా రూపొందిస్తున్నాం. హైరిసొల్యూషన్ పిక్చర్లను, ఇతర సమాచారాన్ని సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సోమవారం నుంచి లాంఛనంగా దీన్ని ప్రారంభించనున్నాం.

– సతీష్ షెనాయ్,
ఇన్‌కాయిస్ డైరెక్టర్

ఇన్‌కాయిస్ లోగో




ఇన్‌కాయిస్ కేంద్రం




కొత్త వెబ్ సైట్